క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కందుకూరు: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా రాచులూరు ఫీడర్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాచులూరు, లేమూరు, గూడూరు సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్ తదితరులు

కందుకూరు: సీఎంఆర్ఎఫ్ పథకం నిరుపేదలకు ఓ వరంలాంటిదని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొత్తగూడకు చెందిన సామ యాదిరెడ్డికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.45 వేల చెక్కును సర్పంచ్ సాధ మల్లారెడ్డితో కలిసి ఆయన శనివారం తన చాంబర్‌లో లబ్ధిదారుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొక్క దీక్షిత్‌రెడ్డి, నాగేష్, విఘ్నేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

మీర్‌పేట: మీర్‌పేట దీన్‌దయాళ్‌నగర్‌లో శ్రీ నగరేశ్వరస్వామి సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేద పండితులు లక్ష్మీగణపతి హోమం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ బి.దయానంద్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీరామచంద్ర మూర్తి గుప్తా, కోశాధికారి వెంకటేశ్వర్లుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఏవీఎన్.రెడ్డిని ఆయన నివాసంలో సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి రావినూతల శశిధర్, సురేశ్, దిలీప్, ఆదర్శ్ తదితరులున్నారు.

సత్కారం

ఎల్‌బీనగర్: సినిమాలు, టీవీ సీరియల్స్ ప్రజలపై అత్యంత ప్రభావం చూపిస్తాయని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా మంచి కార్యక్రమాలు ప్రసారం అయ్యేలా సెన్సార్‌బోర్డు తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రాంమోహన్‌గౌడ్ అన్నారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్‌గా నియమితులైన బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన కృష్ణాదిశేషు శనివారం మర్యాదపూర్వకంగా రాంమోహన్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రాంమోహన్‌గౌడ్ ఆయనను సత్కరించారు. తనకు ఇచ్చిన పదవిని బాధ్యతతో నిర్వహిస్తానని కృష్ణాదిశేషు పేర్కొన్నారు.

కార్మికులను నియమించాలి

కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: సరిపడా పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది లేనందున కాలనీలు, బస్తీల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోందని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా చెత్త తరలించేందుకు అవసరమైన పారిశుద్ధ్య సిబ్బంది, సూపర్‌వైజర్లను విధుల్లోకి తీసుకోవాలని అధికారులను కోరారు. సరైన యంత్రాంగం లేనందున చెత్తాచెదారం పేరుకుపోయి పరిసరాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయన్నారు. దీనికితోడు దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వందశాతం వసూలే లక్ష్యం

- ఇప్పటికి 81.45 శాతం పూర్తి
- ముంచుకొస్తున్న గడువు
- వేగం పెంచిన బిల్‌కలెక్టర్లు
- టాక్స్ చెల్లింపుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు



పన్ను చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ ఆదాయం పెంచేందుకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. అందులో భాగంగా ఓ వైపు ట్రేడ్ లైసెన్సులను జారీ చేస్తూ.. మరోవైపు ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, సర్దార్‌నగర్, ఇమామ్‌గూడ, దేవేందర్‌నగర్ కాలనీ ఇలా గృహాలు, వ్యాపార సముదాయాల ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.4.89 కోట్ల ఆదాయం లక్ష్యం పెట్టుకోగా.. లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు బిల్ కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తున్నారు.

ఇప్పటి వరకు 81.45 శాతం..

లక్ష్యం సాధన కోసం బిల్ కలెక్టర్లు ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.3కోట్ల 97లక్షల 97వేలు (81.45 శాతం) రాబట్టారు. మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగింపునకు కేవలం 13 రోజులు మాత్రమే ఉంది. గడువు సమీపిస్తున్నందున వసూళ్లలో వేగం పెంచారు. మునిసిపల్ పరిధిలోని ఫ్యాబ్‌సిటీ, హార్డ్‌వేరు పార్క్, మంఖాల్ పారిశ్రామిక వాడ తదితర పరిశ్రమల నుంచి టీఎస్ ఐడీఎస్ వసూలు చేసిన ఆదాయ పన్ను నుంచి 40 శాతం వాటాగా మున్సిపాలిటీకి అందజేస్తారు.

సంవత్సరం	ఆదాయ పన్ను	టార్గెట్	వసూలైన శాతం
2018–19	రూ.2కోట్ల 46లక్షల 92వేలు	రూ.2 కోట్ల 15లక్షల 36వేలు	87.22
2019–20	రూ.4కోట్ల 17లక్షల 97వేలు	రూ.3 కోట్ల 2లక్షల 17వేలు	72.29
2020–21	రూ.3కోట్ల 75లక్షల 76వేలు	రూ.3 కోట్ల 41లక్షల 36 వేలు	90.85
2021–22	రూ.2 కోట్ల 58లక్షల 72వేలు	రూ.2 కోట్ల 36లక్షల 53వేలు	91.42
2022–23	రూ.4.89కోట్లు	రూ.3 కోట్ల 97లక్షల 97వేలు (ఇప్పటివరకు)	81.45

అభివృద్ధికి సహకరించాలి..



పురపాలకలో ఆస్తి పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా మా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 80 శాతానికి పైగా రాబట్టి, లక్ష్యానికి చేరువగా ఉన్నాము. ప్రతి ఒక్కరు ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి.

– బి.వెంకట్రామ్, తుక్కుగూడ, మున్సిపల్ కమిషనర్



రామాలయంలో హోమం చేస్తున్న భక్తులు

రెండో రోజు విగ్రహ ప్రతిష్ఠ పూజలు

రంగారెడ్డి జిల్లా: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో సీతారామ లక్ష్మణ సహిత విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ పూజలు శనివారం రెండో రోజు భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆవాహిత పూజ, సుదర్శన హవనము, సుందరాకాండ హవనము, మహోస్నపనం, ధాన్యశయ్య, ఫల, పుష్ప అదివాసము, అదివాస హోమాలు, తీర్థ ప్రసాద వితరణ, భక్తులకు అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతల దంపతులు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మోదిని శంకరప్ప, శివకుమార్, శివమూర్తి ,శివ ప్రసాద్, వీరన్న, వైస్ ఎంపీపీ సునిత, ఎంపీటీసీ సభ్యులు పి.సుదర్శన్ యాదవ్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

21న తైబజార్‌కు వేలం

కందుకూరు: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే తైబజార్‌కు 2023–24 సంవత్సరానికి సంబంధించి ఈ నెల 21న వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సురేందర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ శమంతకమణి ఆధ్వర్యంలో వేలం పాట కొనసాగుతుందన్నారు. ముందుగా రూ.10 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలం దక్కించుకున్న వ్యక్తి మూడు రోజుల్లో 50 శాతం, మిగతా పూర్తి సొమ్ము డిసెంబర్ వరకు చెల్లించేలా ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. చెల్లించని పక్షంలో రెండో వేలందారుకు అప్పగించాల్సి వస్తుందన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చని కోరారు.

త్వరలో రెండో విడత ‘దళిత బంధు’

బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య



మాట్లాడుతున్న చంద్రయ్య

రంగారెడ్డి జిల్లా: దళితుల సంక్షేమానికి బీఆర్ఎస్ నిరంతరం కృషి చేస్తోందని పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య అన్నారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుసగళ్ల జంగయ్య అధ్యక్షతన శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహేశ్వరం, కందుకూరు మండలాల బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని 100 మంది దళితులకు దళిత బంధు పథకం కింద ఒక్కక్కరికి రూ.10లక్షల ఆర్థిక సహాయం యూనిట్లు అందజేశారన్నారు. త్వరలో రెండో విడత కింద నియోజకవర్గంలోని దళితులకు దళిత బంధు రానుందన్నారు. ప్రతీ నాయకుడు, కార్యకర్త బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. త్వరలోనే మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించి నిర్మాణానికి నిధులు మంజూరుకు మంత్రి చర్యలు తీసుకుంటుందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి సబితారెడ్డి గెలుపునకు దళితులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర సాయిలు, మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.ఆనందం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, దళిత నాయకులు కర్రె కుమార్, కర్రె రాజు, ఏకుల రాములు, దార జంగయ్య, యాదయ్య, బాబయ్య, రాములు, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.21కోట్లు

- త్వరలో టెండర్లు
- మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మన్సాన్‌పల్లి, ఉప్పగడ్డ తండా నాయకులు

రంగారెడ్డి జిల్లా: బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.21కోట్ల నిధులు మంజూరు చేశామని.. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని మంత్రి సబితారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి, ఉప్పుగడ్డ తండాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మంత్రిని నగరంలోని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నుంచి మన్సాన్‌పల్లి గ్రామం వరకు వయా కావలోని బాయి తండా, ఉప్పుగడ్డ తండా బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ గిరిజన తండా, అనుబంధ గ్రామం, మేజర్ గ్రామాలకు బీటీ, సీసీ రోడ్లను నిర్మించి ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నామన్నారు. నూతన గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, స్కూల్స్, హాస్టల్స్, కాలేజీలు నిర్మించి ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. సర్వే నెంబర్ 306 ఎలక్ట్రానిక్ పార్కులో విప్రో, మలబార్ గోల్డ్, బ్యాటరీ కంపెనీల ఏర్పాటుతో పాటు పలు భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయనుండడంతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నేనావత్ ఈశ్వర్ నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సామ జాన్‌రెడ్డి, సేవాలాల్ మహారాజ్ ఆలయ కమిటీ చైర్మన్ సీతారామ్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు సేవ్యా నాయక్, రవీందర్ నాయక్, పి.శ్రీనివాస్ ముదిరాజ్, రాజ్‌కుమార్ నాయక్, మల్లేష్, సురేశ్, కల్యాణ్, బాల్‌రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితారెడ్డిని కలిసిన మన్సాన్‌పల్లి, ఉప్పగడ్డ తండా నాయకులు

లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలి

- బాధ్యత వహిస్తూ మంత్రులు రాజీనామా చేయాలి
- యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి



నిరహారదీక్షకు మద్దతు తెలిపిన రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు రోడ్డుమీద పడేలా చేసిన ప్రశ్న పత్రాల లీకేజీ ప్రధాన నిందితులను కఠినంగా శిక్షించాలని, పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి రాజీనామా చేయాలని యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఎల్బీనగర్‌లో నిర్వహించిన నిరాహార దీక్షలో యువజన విభాగానికి చెందిన రాఘవేందర్‌రెడ్డి మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటలాడుకుంటుందని ధ్వజమెత్తారు. ఏళ్లుగా ఉద్యోగం కోసం నిరుద్యోగులు రేయింబవళ్లు కష్టపడి చదువుకుంటే.. ప్రశ్న పత్రాలు లీకై.. పరీక్షలు రద్దు చేయడంతో వారి పరిస్థితి ప్రశ్నార్థంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎనిమిదిన్నర ఏళ్లుగా ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగ ప్రకటన ఇవ్వకుండా.. ఇప్పుడు ఇచ్చినట్లే ఇచ్చి, పరీక్షలు పెట్టి, పేపర్ లీకేజీలకు పాల్పడతారా? అంటూ విమర్శిస్తూ.. ప్రభుత్వాన్ని నిలదీశారు. లీకేజీకి మంత్రులు కేటీఆర్, విద్యాశాఖమంత్రి సబితారెడ్డి, టీఎస్‌పీఎస్సీ కమిషన్ సభ్యులు అందరూ బాధ్యత వహిస్తూ.. రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీకి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి, మంత్రులు రాజీనామా చేసే వరకు రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు.

ఒంటెత్తు పోకడతో ఓటమి తప్పదు!

- పార్టీని నమ్ముకున్న వారిని పట్టించుకోవడం లేదు
- మంత్రి సబితపై బీఆర్ఎస్ నేత మనోహర్‌రెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: మంత్రి సబితారెడ్డి పార్టీలో అందరిని కలుపుకొని పోవాలని, లేకుంటే ఓటమి తప్పదని బీఆర్ఎస్ నేత కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఇప్పటివరకు కారు గుర్తుపై ఒక ఎమ్మెల్యే గెలవలేని పరిస్థితి ఉందన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన ఓ మాజీ ఎమ్మెల్యే పార్టీని భ్రష్టుపట్టించారని, మంత్రి సబిత కూడా పార్టీని బలోపేతం చేయకపోగా, మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సబిత ఒంటెత్తు పోకడతో జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మీర్‌పేట తప్ప అన్ని చోట్ల పార్టీ ఓటమిపాలైందని గుర్తుచేశారు. ఇప్పటికైనా సబిత పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని కోరారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు జరిగితే ముఖ్య నాయకులకు సమాచారం ఇవ్వడం లేదని, ఇలా అయితే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. దళితబంధును మంత్రి తన అనుచరులకే ఇప్పించారని, అర్హులకు ఇవ్వాలని, లేకపోతే దళితులతో కలిసి బాలాపూర్ చౌరస్తాలో ధర్నా చేపడుతానని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎవరికి మద్దతు ఇవ్వలేదని, గెలుపు, ఓటములపై తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో మహేశ్వరం నుంచి ఎవరూ పోటీ చేయని సమయంలో తాను కారు గుర్తుపై పోటీ చేసి 43 వేల ఓట్లు సాధించానని, ముఖ్యమంత్రి ఆదేశిస్తే రానున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని మనోహర్‌రెడ్డి ప్రకటించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుళ్ల సంతోష్‌కుమార్, వేద భవాని, అభిలాష్, తిరుపతయ్య, మహేందర్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత శంకర్‌కు నివాళి



శంకర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, జెడ్పీటీసీ, సీపీఐ నాయకులు

కందుకూరు: సీపీఐ మండల కార్యదర్శి కేజీ శంకర్ అంత్యక్రియలు శనివారం అశ్రునయనాల నడుమ జరిగాయి. ఆయన భౌతికకాయానికి వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రవీంద్రాచారి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ ఇందిర, ఎమ్మార్పీఎస్ నాయకులు యాదయ్య, జంగయ్య, కంద పెద్ద నరసింహా, కొమ్మగళ్ల నరసింహా, సీపీఐ నాయకులు నరసింహా, బి.దత్తునాయక్, జైపాల్‌రెడ్డి, కె.రాజు, యాదయ్య, సురేశ్, రాములు తదితరులు శంకర్ భౌతికకాయానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలను సీపీఐ నాయకులు కొనియాడారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి

మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: ఉద్యోగ పరీక్షల పేపర్ల లీకేజీపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌బీనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేపర్ల లీకేజీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శమని మల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్ నైతిక బాధ్యత వహించాలని అన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాంలో విచారణకు వెళ్తే హంగామా చేసిన మంత్రులు పేపర్ల లీకేజీలపై ఆ స్థాయిలో స్పందించక పోవడం దారుణమన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకుంటే ఆయన ఎందుకు మాట్లాడటం లేదన్నారు. పేపర్ లీకేజీలపై సీబీఐ ఎంక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. నాయకులు శ్రీపాల్, లింగాల కిషోర్‌గౌడ్, కుట్ల నర్సింహాయాదవ్, మంజులత, బండ సురేందర్, జైపాల్, భాను, గోపి, నారాయణ, అరుణ్, యాదగిరి, కిరణ్ పాల్గొన్నారు.

దేవాలయంలో హుండీ చోరీ

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న వినాయకుడి ఆలయంలోని హుండీ చోరీకి గురైంది. పోలీసుల సమాచారం మేరకు... వినాయకుడి ఆలయంలోని హుండీని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆయల మేనేజర్ లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యాయవాదులకు అవకాశాలు మెండు

తెలంగాణ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు నరసింహారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: స్వాతంత్ర పోరాటంలో న్యాయవాదుల పాత్ర మరవలేనిదని, న్యాయవాద వృత్తిలో స్థిరంగా కష్టపడి పనిచేస్తే అనేక రంగాలలో న్యాయవాదులకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎ.నరసింహారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే సంబురాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహారెడ్డి మాట్లాడుతూ... న్యాయవాదులు నిరంతరం సామాజిక బాధ్యతతో మెలగాలని, సమాజంలో అన్ని రంగాల వారికి బాధ్యతతో కూడిన అండగా ఉండాలని సూచించారు. సమ న్యాయ పాలనలో న్యాయవాదులు ప్రధాన పాత్ర వహించాలని తెలిపారు. తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ అలోక్‌కుమార్ మాట్లాడుతూ... న్యాయ శాస్త్ర విద్యార్థులు కష్టపడి చదువుతూ క్రమశిక్షణ కలిగి సమాజంలో అన్యాయన్ని ఎదుర్కొనే శక్తి కలిగి ఉండాలని తెలిపారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు తరుచు అధ్యాపకుల సలహాలు, సూచనలు తీసుకొని వాటిని పాటించాలని సూచించారు. కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... తన సతీమణి గంగుల అరుణ పేరు మీద కళాశాలలో పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందిన విద్యార్థులకు బంగారు పతకాలను, నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, విద్యార్థులు ముబిన్, అన్నపూర్ణ, శ్వేత, రాఖీ, సాయి కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీరోజు చెత్త సేకరించాలి



శానిటేషన్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: ఇంట్లో పోగయ్యే చెత్తను ప్రతీరోజు సేకరించాలని జీహెచ్ఎంసీ కార్మికులకు, రాంకీ సిబ్బందికి సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సూచించారు. శనివారం సరూర్‌నగర్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో శానిటేషన్ శాఖ డీఈ, ఎస్ఎఫ్ఏ, రాంకీ సిబ్బందితో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లక్ష్మీనగర్ కాలనీలో చెత్త సేకరణ, కాలనీలో ఊడ్చడం లాంటి సమస్యలపై కాలనీవాసుల ఫిర్యాదు మేరకు పర్యటించామన్నారు. ప్రతీరోజు చెత్త సేకరణ, కాలనీల్లో రోడ్లను శుభ్రం చేయాలన్నారు. చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయకూడదని.. ఇంటి ముందుకు వచ్చే ఆటో రిక్షాలోనే వేయాలని సూచించారు. కాలనీలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

5న ర్యాలీని జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్

వనస్థలిపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో అఖిల భారత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న మద్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ పిలుపునిచ్చారు. శనివారం వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీలో సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను, రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బి.దుర్గారావు, గణేష్, నరేందర్, చెన్నయ్య, అంజమ్మ, లలిత, చంద్రమ్మ, అలివేలు, చంద్రకళ, అనిత, సుగుణ పాల్గొన్నారు.